# కోడెను కట్టాలె!

బిందువు!

అది కన్నీటి బిందువు కావచ్చు... ప్రశ్న గుర్తులోని బిందువు కావచ్చు.

కరీంనగర్‌జిల్లాలోని వేములవాడ దేవస్థానం గురించి మీరు వినే ఉంటారు. అక్కడ చూసిన దృశ్యం అది! ఇప్పటికీ ఆ దృశ్యాన్ని తలుచుకుంటే కళ్లలో నీళ్ళు తిరుగుతాయి.

భక్తులు వేములవాడ రాజరాజేశ్వర స్వామికి రకరకాల కానుకలు సమర్పిస్తుంటారు... ఎన్నో మొక్కులు ముడుపులు చెల్లిస్తారు.

ఆలయ ప్రాంగణంలోనే ఒక మూలకు చిన్న 'దర్గా' ఉంది. దండాలు పెడ్తున్న చేతులు సలాములు కూడా చేస్తుంటాయి. చిట్టిచిట్టి పాదాలతో పిల్లలు అటూ ఇటూ పరుగెడుతూ మేమోయ్ అసలు దేవుళ్లం అని అరుస్తారు. కానీ ఎవరూ వినిపించుకోరు.

చిరులేత గిట్టలతో దూడలు తిరుగుతుంటాయి. వాటి మెడలో లయబద్ధంగా చిరు గంటలు మోగుతుంటాయి. 'అంబా' అని మోరలెత్తి పిలుస్తుంటాయి.

శ్రావ్యంగా సన్నాయి మేళం వినిపిస్తుంది. గుండె దరువు వేస్తుంది. అన్నపూజ చేసే భక్తులది ఒక వరుస – ధర్మదర్శనానికి మరో వరుస బారులు తీరి భక్తులు 'హరిహరమహాదేవ శంభో' అంటూ కోటి దండాలు పెడుతూ కదులుతుంటారు.

ఒక కుటుంబం నా కంట పడింది. నడివయసు దాటి ఉద్యోగ విరమణ చేసిన, లేకచేయబోతున్న తండ్రీ, తల్లి, గుమస్తాలాంటి యువకుడు,అతని భార్యా, ఒక పిల్లాడు... మొత్తం ఐదుగురు.

"ఏములాడ రాజేసుడా! సల్లంగ సూడు తండ్రీ" అని కాబోలూ తల్లి గర్భగుడివైపు తిరిగి పదే పదే మొక్కుతున్నది.

గంటలు గణగణ మోగుతున్నాయి.

గునగునపిల్లలు పరుగులు... వారిని అందుకోను తల్లుల పరుగులు...

అంతా ఒకే గొడుగు నీడలో కదిలే భక్తకోటి! హరనామస్మరణలతో ప్రతిధ్వనించే రాతి గోపురాలు... ఆ కుటుంబం అప్పుడే పూజలు ముగించి వస్తున్నది.

"పైసలియ్యి...,చీటి తీసుకోవాలె గదా..." తల్లి అడిగింది.

"ఎందుకు?" కసురుకున్నాడు భర్త... కసురుకునే వాడే కదా భర్త!!

"కోడెను కట్టాలె – అప్పుడు జెప్తి గదా..."

దూడ పలుపుతాడు పట్టుకుని గుడి చుట్టూ తిప్పి ఒక గుంజకు కట్టేయడం అనేది ఒక మొక్కు

దీన్నే కోడెను కట్టడం అంటారు.

"ఎప్పుడు మొక్కుకున్నవ్?" మొహం చిట్లించి అడిగాడు భర్త.

మొహం చిట్లించే అతనికళ్ల ముందు మున్సిపాలిటి ఇన్స్పెక్టర్లు బలాదూర్! ప్రభుత్వ డాక్టర్లు బాలాదూర్! ప్రైవేట్ హెడ్మాష్టర్లు బలాదూర్!

"ఏందయ్యో! గట్టంటవు! ఆనాడు కొడుక్కు పానం బాగలేదు యాదిమర్సినావు గప్పుడు మొక్కలే..."

"ఔ" అన్లేదు భర్త.

"ఎహె – గండ్ల ఏమున్నది – పుజుల్గ పైసలు కర్సు –

"గిది కర్సా...దేవునికి పెడ్తె కర్సా! గింతదూరం వచ్చి మొక్కు ముట్టజెప్పకపోతాం!! తప్పుగాదూ!!"

"ఏం గాదూ పా..."

ఆమె అభ్యర్థనను తోసిపుచ్చాడు భర్త. కర్కషంగా నిరాకరించాడు –

"జెర పైసలియ్యి అయ్యా అట్ల పోకయ్యా" "ఎహె పో..."

అతణ్ణి బతిమిలాడి ప్రయోజనం లేక వాపోయి నిల్చున్నది తల్లి.

ఏం చేయాలో ఆమెకు పాలుపోలేదు.

వెనుక వస్తున్న కొడుకు ఆమెను సమీపించాడు. తల్లి కొడుకును ఆపి ప్రాధేయపడింది.

"కోడెను కడ్తనని మొక్కిన బిడ్డా..."

"ఉహూ..."

"జెర చీటికి పైసలియ్యి బిడ్డా..." ఎంతో బతిమిలాడుతూ అడిగింది.

అప్పటిదాకా తండ్రి ప్రశ్నించినట్లే అడిగాడు.

"ఎందుకు మొక్కినవ్?"

"గాపొద్దున నీ పాణంల బాగలేకపోతే మొక్కలే బిడ్డా... నా కొడుకు కోడెలెక్క ఉంటె కోడె కడ్తనని రాజన్నకు మొక్కిన..."

తన కోసమే తల్లి మొక్కుకున్నదని తెలిసి కూడా కొడుకు కరగలేదు-

తండ్రీ తిరస్కరించడం గమనించాడు కదా - తనూ లక్ష్యపెట్టలేదు!

"అన్నపూజ ఆ మొక్కులన్నీ తీర్చినంగదా..."

"కోడెను కట్టాలె బిడ్డా... పైసలియ్యి నాయినా... ఎన్కముందాడకు..."

తల్లి మాటను పెడచెవిని పెట్టాడు -

"ఇందులో ఏమున్నదమ్మా - పైసలు దండుగ పాపా..." అని కొడుకు తల్లిని దాటేసి వెళ్ళిపోయాడు.

తండ్రిని అనుసరించాడు.

తండ్రి మాటకు వ్యతిరేకంగా నడవడం ఇష్టం లేనట్లు ఉంది.

అది ఏమాటైనా!

తల్లి బాధపడుతుందని మాత్రం ఆలోచించలేదు!

"అయ్యో! ఎన్ని పైసలు కర్సయితలేవు గీకోడెను కడ్తెనే కర్సయితాది కొడుకా!!" అంటూ వాపోయింది తల్లి.

తాను మొక్కిన మొక్కు తీర్చు మార్గం ఆమెకు కనిపించలేదు -

అటు భర్తను అడిగితే ఇవ్వడు ఇటు కొడుకును అడిగితే డబ్బులు ఇవ్వడు!!

బిక్కమొగంతో నిల్చున్నది ఆ తల్లీ!

కొడుకు కోసం మొక్కి ఆ కొడుకునే మొక్కు తీర్చడానికి డబ్బు అడిగే ఆ తల్లిదైన్య

పరిస్థితి నన్ను కలచివేసింది.

తన అభ్యర్థనను తోసిపుచ్చి వెళ్ళిపోతున్న భర్తను, కొడుకును చూస్తూ దీనంగా నిల్చున్నది.

"నేను సంపాయించే దానిని కాకనే కద గిట్ల మిమ్ముల గీమాల్తాన!" అన్నది తనలో తానే అనుకుంటున్నట్లు విచారంగా

"మొక్కు" మూఢనమ్మకమా కాదా అన్నది ముఖ్యమైన ప్రశ్నకాదు - ఆ తల్లి కళ్లలో ఉబికిన ఆవేదన నా గుండెను కుదిపేసింది. ఆ తరువాత వెనక వస్తున్న మనవడు ఆమెను సమీపించాడు. అప్పటిదాకా జరిగిన సంభాషణంత విన్నాడేమో...

ఆ లేత మనసుకు ఏమనిపించిందో ఏమో ఆప్యాయంగా ఆమె నడుము చుట్టూ చేతులు వేసి "నీ దగ్గర పైసలు ఎందుకు లేవు నాన్నమ్మా?" అని అడిగాడు.

*మందాకిని మాసపత్రిక, జనవరి **1995***